నా జీవితం పేదలకు అంకితం..

- బీజేపీ దేశాన్ని మోసం చేసే పార్టీ
- బీసీబంధులో పద్మశాలీ కులాన్ని చేర్చేందుకు కృషి చేస్తా..
- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

ధర్మారం(బీ)లో నో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, డిచ్‌పల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పద్మశాలీ కులస్తులు

డిచ్‌పల్లి, అక్టోబర్ 29: నా 45 ఏండ్ల రాజకీయ జీవితం పేదలకు అంకితం చేశానని, బలహీనులను బలవంతులను చేయడానికే తాను కృషి చేస్తానని నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన రూరల్ నియోజకవర్గం పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీసీబంధు పథకంలో పద్మశాలీ కులాన్ని చేర్చడానికి సీఎం కేసీఆర్‌తో మాట్లాడతానని తెలిపారు. పద్మశాలీ సంఘాలు తనకు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేయడం సంతోషంగా ఉన్నదన్నారు. పద్మశాలీ కులస్తుల సొసైటీలు ఏర్పాటు చేసుకుంటే మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి టెక్స్‌టైల్స్ పార్క్స్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన జీవితం తెల్లకాగితం లాంటిదన్నారు. రూరల్ నియోజకవర్గంలోని ఇప్పటివరకు 55 పద్మశాలీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం కోసం రూ.2.50 కోట్లు నిధులు ఇచ్చానన్నారు. మూడోసారి తనను గెలిపిస్తే పద్మశాలీలు రాజకీయంగా ఎదిగేందుకు తనవంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ భూపతిరెడ్డి ఓడిపోయిన అనంతరం ప్రజలను గాలికి వదిలేసి పోయాడని విమర్శించారు. ఎన్నికల కోసం ఇల్లు అమ్ముకున్నాను, భూములు అమ్ముకున్నానంటూ దొంగ ఏడ్పులతో మీ ముందుకు వచ్చి మాయమాటలతో మోసం చేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. రాజకీయం అంటే వ్యాపారం కాదని, ఓడినా, గెలిచినా ప్రజల మధ్యనే ఉండాలని పేర్కొన్నారు. బీజేపీ.. దేశాన్ని దోచుకునే పార్టీ అని, ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు ఆ పార్టీ నాయకులు వస్తే నిలదీయాలని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కులవృత్తులకు జీవం పోసేందుకే పలు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో స్థలం చూయిస్తే పద్మశాలీ సంఘం నిర్మాణం కోసం రూ.50లక్షలు మంజూరు చేయిస్తానని బాజిరెడ్డి గోవర్ధన్ హామీఇచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రూరల్ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధనకు అండగా నిలబడి మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌మోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పద్మశాలీ సంఘం కార్యదర్శి పుల్గం హన్మండ్లు, పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గుజ్జేటి నర్సయ్య, తన్నూరి శ్రీనివాస్, చిలువేరి దాసు, శక్కరికొండ కృష్ణ, శ్రీపతి శేఖర్, రామకృష్ణ, లోలం జగదీశ్వర్, చింత మహేశ్, రేగుంట విశ్వప్రకాశ్, సామల రాజేశ్, చిలుక రాజేశ్వర్, అంకం నరహరి, భూమేశ్వర్, రాధాకిషన్, ఎస్‌పీ నారాయణ, తాల్ల రాజు, ఏడు మండలాల పద్మశాలీలు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి గెలిపిస్తే రెట్టింపు అభివృద్ధి చేస్తా..

రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన రూరల్ ప్రజలకు ఎంతో రుణపడి ఉంటానని, మరోసారి గెలిపిస్తే రెట్టింపు అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) పీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మారం(బీ) గ్రామానికి సీఎం కేసీఆర్‌ను తీసుకువచ్చి నిధులు మంజూరు చేయించానన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వైకుంఠధామం, హైస్కూల్‌కు ప్రహరీ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమ్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలగర శ్రీనివాస్, సర్పంచ్ పత్తి మమతాఆనంద్, వీడీసీ అధ్యక్షుడు తలారి సాయన్న, విండో చైర్మన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతు, ప్రజావ్యతిరేకి..

- ఒకడేమో రైతుబంధు దుబారా అంటడు..
- ఇంకొకడేమో రైతులకు 3గంటల కరెంటు చాలని అంటడు..
- కొడుకులాంటి వ్యక్తి మీద అన్నపూర్ణమ్మ ఆరోపణలు తగునా..
- బీజేపీని ప్రజలెవ్వరూ నమ్మరు
- లబ్ధిదారులు ఓటు వేసినా.. ప్రతిపక్షాలకు డిపాజిట్లు రావు
- బీఆర్ఎస్ సైనికులు గడపగడపకూ వెళ్లి ఓటు అడగాలి
- గెలుపు పక్కా.. మెజారిటీ కోసం కృషి చేయాలని పిలుపు
- భీమ్‌గల్, కమ్మర్‌పల్లి మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాల్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్/కమ్మర్‌పల్లి, అక్టోబర్ 29: కాంగ్రెస్ పార్టీ రైతువ్యతిరేక, ప్రజా వ్యతిరేక పార్టీ అని రాష్ట్ర రోడ్లు-భవనాలు, గృహ నిర్మాణ, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం భీమ్‌గల్, కమ్మర్‌పల్లి మండలాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతుకు మేలు చేసే పథకాలపై కాంగ్రెస్ పార్టీ విషం చిమ్ముతున్నదని విమర్శించారు. ఒకడేమో రైతుబంధు దుబారా అని మాట్లాడితే, మరొకడు వ్యవసాయానికి 3 గంటల ఉచిత కరెంటు చాలని మాట్లాతాడని, మధ్యలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వచ్చి వాళ్ల రాష్ట్రంలో 5 గంటల కరెంటు మాత్రమే ఇస్తున్నామని ఒప్పుకున్నాడని గుర్తుచేశారు. డీకే శివకుమార్ మాట్లాడిన మాటలను కార్యకర్తలకు వినిపించారు. రైతులపై వాళ్లకు ఉన్న అక్కసు బయటపడిందని, కాంగ్రెస్‌తో రైతులకు కరెంటు ఇబ్బందులే వస్తాయని అన్నారు. రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్న కేసీఆర్ కావాల్నా.. 2,3,5 గంటల కరెంటు ఇస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ కావాలా ఆలోచన చేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీని నమ్మితే అరిగోస తప్పదన్నారు. కాంగ్రెస్ నేతలవి బక్కాస్, బేకార్ మాటలని మండిపడ్డారు. ఫాల్తూ కాంగ్రెస్ పార్టీ, ఫాల్తూ గ్యారంటీలు ప్రకటిస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. బీజేపీని ప్రజలెవరూ నమ్మరని అన్నారు. కొడుకు లాంటి వ్యక్తి పై ఎమ్మెల్యే పదవి కోసం అన్నపూర్ణమ్మ అసత్య ఆరోపణలు చేయడం తగునా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పదవి కోసం అన్నపూర్ణమ్మ దిగజారి మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్ సైనికులు గడపగడపకూ వెళ్లి ఓటు అడగాలని, లబ్ధిదారులు వేసే ఓట్లతోనే ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా రావని, ఆ స్థాయిలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మీరిచ్చే ధైర్యంతో గెలుపు పక్కా.. కేసీఆర్ గారిని మెప్పించే మెజారిటీ కోసం కృషి చేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలని సూచించారు. రూ.400కే గ్యాస్ సిలిండర్, మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా రూ.3వేలు, రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ, రైతుబంధు పెంపు, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.15లక్షలకు పెంపు, ఆసరా పింఛన్ల పెంపు విషయాలను తెలిపాలన్నారు.

భీమ్‌గల్ గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా..

ఉద్యమ కాలం నుంచి భీమ్‌గల్ గడ్డ..బీఆర్ఎస్ అడ్డా అని మంత్రి వేముల అన్నారు. వెనుకబడిన భీమ్‌గల్‌ను పందల కోట్లతో మనసుపెట్టి అభివృద్ధి చేశానన్నారు. మేమూగంటి ప్రాజెక్టు క్లియరెన్స్ తెచ్చి సాగునీటి గోస తీర్చామన్నారు. పల్లికొండ చెరువు నుంచి మిగతా చెరువులు నింపడానికి చైన్‌లిన్‌గ్యాంక్ పనులు కూడా పూర్తయ్యాయని తెలిపారు. కప్పులవాగు మీద చెక్‌డ్యాంలు నిర్మించి, ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని భీమ్‌గల్,సికింద్రాపూర్,బడా భీమ్‌గల్,గోన్‌గోప్పుల,ముచ్కూర్,బాబాపూర్,జెజ్జోర,మెండోరా,చేంగల్ ఇలా మండలంలోని సుమారు 20 గ్రామాలకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేశామన్నారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత సహకారంతో భీమ్‌గల్ పట్టణ ముఖచిత్రమే మారిందన్నారు. వంద పడకల దవాఖాన, బస్ డిపో, వందల కోట్లతో టీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, ఓపెన్ జిమ్, సెంట్రల్ లైటింగ్, రాధం చెరువు సుందరీకరణ ఇలా అనేక విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. భీమ్‌గల్ ప్రాంత ప్రజల ప్రేమ వెలకట్టలేనిదని, అభివృద్ధి పనుల పరంపరను ఎవ్వరూ ఆపలేనన్నారు. భీమ్‌గల్ మండలంలో 13,574 మందికి పింఛన్లు, 15,106 మందికి రైతుబంధు, 246 మందికి రైతుబీమా, 1765 మందికి సీఎంఆర్ఎఫ్, 1430 మంది గృహలక్ష్మి, 2669 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 256 కులసంఘాలకు రూ.11.23కోట్ల నిధులు, 13 ఆలయాలు, 27 మసీదులు, 18 చర్చిలకు రూ.6కోట్ల నిధులను ఇచ్చినట్లు గుర్తు చేశారు.

మల్లారంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కమ్మర్‌పల్లి మండలాభివృద్ధికి విశేష కృషి..

సీఎం కేసీఆర్ సహకారంతో కమ్మర్‌పల్లి మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశానని మంత్రి వేముల అన్నారు. హన్మంత్ రెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బాగుచేయించి ఎండాకాలంలోనూ చెరువులను నిండుకుండల్లా ఉంచామన్నారు. పునరుజ్జీవ పథకంతో వరద కాలువను కాళేశ్వరం ప్రాజెక్టు జలాలతో ఏడాదంతా నిండుగా ఉంచుతూ రెండు పంటలు పండించుకునేలా చేశామన్నారు. మండలంలో 8464 మందికి ఆసరా పింఛన్లు, 8971 మందికి రైతుబంధు, 117 మందికి రైతుబీమా, 1407 మందికి సీఎంఆర్ఎఫ్, 757 మందికి గృహలక్ష్మి, 1314 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 205 కుల సంఘాలకు భవనాలు మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు.కార్యక్రమంలో హెల్త్ అండ్ హ్యూమిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రాజారాం యాదవ్, రైతు నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు

అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి

ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్



గాంధారి మండలం ముదెల్లిలో మహిళను ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే జాజాల

గాంధారి/ రామారెడ్డి, అక్టోబర్ 29: సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను చూసి మరోసారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ ఎల్లారెడ్డి అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గాంధారి మండలంలోని ముదెల్లి గ్రామంలో ఆదివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు తెలంగాణలోనే అమలవుతున్నాయని అన్నారు. ఐదేండ్లలో ముదెల్లి గ్రామానికి అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాలకు దాదాపు రూ.47కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసినట్లు వెల్లడించారు. కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం మ్యానిఫెస్టోలో చేర్చిన ప్రతి అంశాన్ని అమలు చేస్తారని చెప్పారు. అంతకుముందు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శివాజీరావు, జడ్పీటీసీ శంకర్‌నాయక్, ఎంపీపీ రాధబలరాం, ఏఎంసీ చైర్మన్ సత్యంరావు, మాజీ జడ్పీటీసీ తానాజీరావు, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్, విండో చైర్మన్ పెద్దబూరీ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డిలో..

రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామంలోని శ్రీకాలభైరవ స్వామి ఆలయంలో వాహనానికి పూజలు చేయించారు. అనంతరం గ్రామంలో ప్రచారం చేశారు. సదాశివనగర్ నుంచి రామారెడ్డి వరకు డబుల్ రోడ్డు, రామారెడ్డిలో సీసీ రోడ్డు, డబుల్ రోడ్డును వేయించినట్లు ఎమ్మెల్యే జాజాల గుర్తుచేశారు. పని చేసే ప్రభుత్వాన్ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కందూరి బాలమణి పెద్దలింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి మండలం ఇసన్నపల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

పదేండ్ల శ్రమను గుర్తించి

మళ్లీ దీవించండి..

ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

నందిపేట్, అక్టోబర్ 29: నా జీవితం ప్రజా సేవకే అంకితమని, పదేండ్ల శ్రమను గుర్తించి మళ్లీ ఆశీర్వదించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. నందిపేట మండలంలోని మల్లారం, కంఠం, అయిలాపూర్, ఆంధ్రానగర్ గ్రామాల్లో ఆదివారం ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే నా ప్రచార అస్త్రాలని, నాపై పోటీకి ప్రజల మధ్య చిచ్చు పెట్టే మాయగాళ్లు వస్తున్నారని, వారి మాయలో పడొద్దని ప్రజలను కోరారు. ఓటు ఆయుధంతో అరాచకశక్తుల ఆట కట్టించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీలు నీతీనియమం లేని పార్టీలని విమర్శించారు. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని, మూడోసారి బీఆర్ఎస్‌దే విజయమన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు వంటి అనేక వర్గాలకు చెందిన వారికి రూ.2016, దివ్యాంగులకు రూ.4016ల చొప్పున ఆసరా పింఛన్లు ఇస్తున్నట్లు వివరించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతు బీమీ, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు తదితర పథకాలు అమలు చేస్తూ సీఎం కేసీఆర్ పేద ప్రజల పక్షపాతిగా చరిత్రకెక్కారని జీవన్‌రెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

కారుజోరును ఆపలేరు..

మతం పేరుతో ప్రజల మధ్య మంట పెట్టే గుజరాత్ గులాంలను, గాంధీల ఇంటి చుట్టూ తిరుగుతూ ఢిల్లీకి సలాం కొట్టేవాళ్లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మనది తెలంగాణ ఆత్మగౌరవపోరు అని, కారుజోరును ఎవరూ ఆపలేరని అన్నారు. ఆర్మూర్‌పై అరాచక శక్తుల కన్ను పడిందని, అభివృద్ధి నిరోధక, అవినీతికర మూకలు రకరకాల పార్టీల ముసుగులో దాడికి వస్తున్నారని, వాళ్లకు ఓటేస్తే మనల్ని కాటేస్తారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీల నీడ కూడా ఆర్మూర్‌పై పడొద్దన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని తలచే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

ఆంధ్రానగర్‌లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు